

28న జిల్లాకు మందకృష్ణ మాదిగ రాక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే ధర్మయుద్ధ మహాసభ కార్యక్రమానికి ఈనెల 28న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మం దకృష్ణ మాదిగ వస్తున్నారని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బాలు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సైతం గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు లక్ష్మీ, నాయకులు యాదగిరి, కాశీరాములు, రమేష్, లావణ్య, బుజ్జి పాల్గొన్నారు.

తెలంగాణ ఉప పీఠానికి చేరుకున్న జగద్గురు భక్తులు



జుక్కల్‌లోని జగద్గురు ఉప పీఠానికి చేరుకున్న పాదయాత్ర భక్తులు

మద్నూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని బంగారుపల్లి, దోస్పల్లి జగద్గురు నరేంద్రాచార్య మహరాజ్ తెలంగాణ ఉప పీఠానికి పాదయాత్ర భక్తులు తిరిగి చేరుకున్నారు. గత నెలలో ఈ ఉప పీఠం నుంచి ప్రధాన పీఠమైన మహారాష్ట్రలో నానిజ్‌కు పాదయాత్రతో భక్తులు వెళ్లారు. వారు 650 కిలో మీటర్ల దూరంలో ఉన్న నానిజ్‌కు పాదయాత్ర ద్వారా వెళుతూ జగద్గురు నరేంద్ర ఆచార్య మహరాజ్ గ్లోబల్ వార్నింగ్ సందేశాన్ని ఫ్లెక్సీల ద్వారా బ్యానర్ల ద్వారా ప్రవచనాల ద్వారా ప్రజలను జాగ్రుతం చేశారు. పాదయాత్ర చేసుకుని తిరిగి యువ పీఠానికి జాగ్రుతం చేశారు. పాదయాత్ర చేసుకుని తిరిగి యువ పీఠానికి చేరుకున్న భక్తులకు గ్రామస్థు లు బాజా, భజంత్రీలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తెలంగాణ ఉప పీఠం సేవా సమితి సభ్యులు మహాప్రసాదం ఏర్పాటు చేశారు.

గురుకులాల్లో సమస్యలు..
తీరేదెన్నడో?



కామారెడ్డిలో అద్దె భవనంలో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాల

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో సమస్యల తాండవం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- 11 చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న గురుకులాలు
- బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న యజమానులు
- జిల్లాలో దాదాపు రూ.1.14 కోట్ల బకాయిలు
- ఇటీవల బీబీపేట జ్యోతిబాపూలే పాఠశాల, వసతి గృహాన్ని మార్చాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- అధికారులు స్పందించడం లేదంటూ విమర్శలు

కామారెడ్డి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అత్యాధునిక వసతులతో పాటు మంచి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. నెలల తరబడి బిల్లులు రాక విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అనేక చోట్ల సమస్యలు తాండవిస్తున్నాయని అయినా ప్రభుత్వం గాని ఉన్నతాధికారులు గాని చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తూనే ఉన్నారని ఆరోపణలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. చాలా చోట్ల ఇరుకు గదులు, అద్దె భవనాల్లోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 11 చోట్ల అద్దె భవనాల్లోనే గురుకులాలు కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు సైతం నెలల తరబడి బిల్లులు చెల్లించక పోవడంతో యజమానులు సైతం నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లాలో దాదాపు ఆయా అద్దె భవనాలకు కలిపి రూ.1.14 కోట్ల వరకు బకాయిలు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. ఇక బీబీపేట జ్యోతిబాపూలే పాఠశాల, వసతి గృహాన్ని మార్చాలంటూ ఇప్పటికే పలుమార్లు రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అవస్థల మధ్యనే విద్యార్థులు చదువును కొనసాగిస్తున్న అధికారులు స్పందించడం లేదనే తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

వసతులు సరిగా లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలకు నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. చాలా చోట్ల భోజనాలను నాణ్యతతో పెట్టడం లేదని సమాచారం. విద్యార్థులకు అల్పాహారంతో పాటు భోజనాలు సమకూరే ... నిర్వాహకులకు సరైన సమయానికి నిధులు అందకపోవడంతో అప్పులు తెచ్చి మరీ వండిపెడుతుండడంతో ఆర్థిక భారం మోయలేక పలు చోట్ల తక్కువ ధరకు వస్తున్న నాణ్యతలేని వస్తువులను తీసుకువస్తు వంటలు చేస్తున్నారని విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు, బాత్రూంలు సరిగా లేవని విద్యార్థులు పడుకునేందుకు సరైన సౌకర్యాలు లేవని వర్షాలు పడి తే నీరు వసతి గృహాల్లోకి వచ్చి నిద్రలు లేని రాత్రులను విద్యార్థులు గడపాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. సెలవు సమయంలో విద్యార్థులను చూసేందుకు వస్తున్న తల్లిదండ్రులకు వారి గోడును వెల్లబోసుకుంటూ కంటతడిపెడుతున్నారని ఆయా గురుకులాల తల్లిదండ్రులు వాపోతున్నారు.

11 చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగింపు

జిల్లాలోని 11 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ప్రైవేట్ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ గురుకులాలకు సంబంధించి అద్దె బకాయిలు కోట్లలో పేరుకుపోయాయి. సుమారు రూ.1.14 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. కామారెడ్డి పట్టణ శివారులో ఎస్టీ గురుకుల అద్దె భవనానికి గత 8 నెలలుగా అద్దె రావడం లేదు. దీని బకాయి రూ.23లక్షల వరకు, మండలంలోని సరంపల్లిలో ఎస్టీ గురుకులం గత మూడు నెలలుగా అద్దె రావడం లేదు. దాదాపు రూ.10లక్షల వరకు, దేవునిపల్లిలో ఎస్సీ గురుకులం బకాయి దాదాపు రూ.10లక్షల వరకు, ఇల్చిపూర్ రోడ్డులో గల మైనార్టీ గురుకుల పాఠశాల అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఇక సదాశివనగర్ మండలం మర్కల్‌లో ఎస్సీ గురుకులం దాదాపు రూ.15లక్షల వరకు, కుప్రియల్ జ్యోతిబాపూలే గురుకులం దాదాపు రూ.9.12లక్షలు, లింగంపేట మండలంలో మైనార్టీ గురుకుల పాఠశాల దాదాపు రూ.10లక్షల వరకు, భిక్కనూర్ మండలం బస్వాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం అద్దె రూ.5.30లక్షల వరకు, బాన్సువాడలోని బోర్లం మైనార్టీ గురుకులం అద్దె రూ.5లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. బీబీపేట మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు దాదాపు రూ.5లక్షల వరకు బకాయి పేరుకపోయింది. ఇలా జిల్లాలో ప్రభుత్వ భవనాలలో సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది, విద్యార్థులు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, కళాశాలలకు అద్దె రాకపోవడంతో భవన యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అవస్థలు తీర్చాలని రోడ్డెక్కుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జిల్లాలోని ఆయా గురుకులాల్లో ఉన్న ఇబ్బందులను తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డెక్కి నిరసన తెలిపే పరిస్థితులు నెలకొంటున్నాయి. బీబీపేట మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల, హాస్టల్ ప్రైవేట్ బిల్డింగ్‌ను మార్చాలని విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ కలెక్టరేట్ వద్ద ఇటీవల నిరసన తెలిపారు. బీబీపేట జ్యోతిబాపూలే బాలుర హాస్టల్ ప్రైవేట్ బిల్డింగ్‌లో కొనసాగుతుందని

(మిగతా 8వ పేజీలో)



ప్రమాదకరంగా ప్రాజెక్టు రహదారి

- పట్టింపు లేని పాలకులు, అధికారులు
- 2021లో ఆదరా బాదరగా.. బీటీ రోడ్డు మరమ్మతులు
- సైడ్ రేయింగ్ లేని ప్రాజెక్టు ఘాట్ రోడ్డు
- ఫిషరీస్ ఆఫీస్ నుంచి మాసంపల్లి ఎక్స్ రోడ్డు వరకు గుంతల రోడ్డే..
- ఇదీ ప్రాజెక్టు రహదారి, వీఐపీలు వెళ్లే రహదారి దుస్థితి

7

ఆర్టీసీ డ్రైవర్లకు తిప్పలు!

- దుబ్బాక, బీబీపేట, పెద్దమాల్లారెడ్డి వైపు విధులు నిర్వహించే డ్రైవర్‌లకు తప్పని కష్టాలు
- టోల్‌గేట్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం
- సమయానికి బస్సులను నడపాలని ప్రయాణికుల వేడుకోలు

7



బస్వాపూర్, కాచాపూర్ విండోలకు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలి

- విండోలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం చెల్లదు
- హైకోర్టు తీర్పు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాత పాలకవర్గం సభ్యులు

భిక్కనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, కాచాపూర్ విండోలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం చెల్లదని, ఈ నియామకం చట్ట విరుద్ధమని ఈ విండోలకు పాత పాలకవర్గాన్నే (5 సంవత్సరాలకు ఎన్నుకోబడిన) కొనసాగించాలని గురువారం రాష్ట్ర హైకోర్టు తుది తీర్పు నిచ్చింది. బస్వాపూర్ విండో నుంచి విడదీసి కాచాపూర్ విండోను ఆగస్టులో ప్రత్యేక విండోగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా బస్వాపూర్ విండో పాలకవర్గాన్ని రద్దు చేసి అధికారులు రెండు విండోలకు ఇటీవల పర్సన్ ఇన్‌చార్జీలను నియమించారు. దీంతో విండో ఉపాధ్యక్షుడు మద్ది స్వామితో పాటుగా పలువురు విండో డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇరువురి వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి మాధవీదేవి నిబంధనలకు విరుద్ధంగా విండోలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడం సరికాదని, వెంటనే బస్వాపూర్, కాచాపూర్ విండోలకు పాత పాలకవర్గాన్ని కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. దీంతో పాత పాలకవర్గం సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా విండో ఉపాధ్యక్షుడు మద్ది స్వామి, డైరెక్టర్లు మాట్లాడుతూ అన్యాయం ఎప్పటికీ గెలవదని, ఎన్నటికైనా న్యాయమే గెలుస్తుందని అన్నారు. తాము మొదటి నుంచి పర్సన్ ఇన్‌చార్జీల నియామకాన్ని వ్యతిరేకించామని తెలిపారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో వానాకాలం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకానికి రూ.2300, సన్న రకం వడ్లకు అదనంగా రూ.500 చెల్లిస్తుందని తెలిపారు. సన్నరకం ధా న్యం గుర్తించడానికి సన్న రకం ధాన్యం నింపిన బస్తాలకు ఎర్రదారంతో కుట్టి ఎస్ అనే అక్షరం ముద్రించాలని ఆదేశించారు. దొడ్డు రకం ధాన్యం బస్తాలకు ఆకుపచ్చ దారంతో కుట్లను వేయాలని తెలిపారు. రెండింటిని వేర్వేరు లారీల్లో నింపి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి వసతి, ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు వేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సురేందర్, పౌరసరాఫరాల మేనేజర్ రాజేందర్, జిల్లా మా ర్కెటింగ్ అధికారి రమ్య, జిల్లా సహకార అధికారి రాంమోహన్, డీపీఎం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు, భవనాల పనులు నాణ్యతతో చేపట్టాలి

ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు, భవనాలు తదితర పనులకు ప్రతిపాదించిన పనులను నాణ్యతతో చేపట్టాలని, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురిసిన వర్షాల వల్ల రోడ్లు, కాల్వలు, తదితర పనులకు ఆయా శాఖలు మరమ్మతులకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. చేపడుతున్న పనులను నాణ్యతతో నిర్వహించాలని ప్రతీ పనికి సంబంధించిన ఫొటోలు సమర్పించాలని తెలిపారు. ఆయా పనులు పూర్తిచేసి యూటిలైజేషన్ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి బోధనను అందిస్తున్నాం

ఇంటర్వ్యూ



- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం
- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 973 పాఠశాలలను గుర్తించాం
- జిల్లాలో ఇటీవల 433 మంది ఉపాధ్యాయుల భర్తీ
- రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలు నిర్వహించేందుకు సన్నాహాలు
- జిల్లా విద్యాశాఖాధికారి రాజు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి బోధన అందేందుకు కృషి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 973 పాఠశాలల్లో పనులు చేయిస్తున్నామని డీఈవో రాజు అన్నారు. గురువారం జిల్లాలోని ఆయా పాఠశాలల్లో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయుల వివరాలు, 2008 డీఎస్సీకి చెందిన ఉపాధ్యాయులు ఎంత మంది రాబోతున్నారు, డిప్యూటేషన్‌లు తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మొత్తం ఎన్ని పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఎంత మంది ఉన్నారు?

డీఈవో: జిల్లాలో మొత్తం 1,244 మంది పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,59,620 మంది విద్యార్థులు ఉన్నారు. కేజీబీవీలో 5,405, గురుకులం 255, మైనార్టీ వెల్ఫేర్ 2,185, మహాత్మగాంధీ జ్యోతిబా పూలే 3,486, ప్రాథమిక, జిల్లా పరిషత్‌లో 73,959, నవోదయ 325, ప్రైవేట్ ఏయిడెడ్ 464, అన్ ఎయిడెడ్ 56,994, స్టేట్ గవర్నమెంట్ స్కూళ్లలో 1,784, స్టేట్ గవర్నమెంట్ డీఎస్‌టీ 794, ఆదర్శ పాఠశాలలు 4,006, టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లు 6,478, టీఎస్‌టీడబ్ల్యుఆర్‌ఈఐ 1,720, టీఎస్‌ఈఎంఆర్‌ఎస్ పాఠశాల 395, టీఎస్‌ఆర్‌ఈఐ సొసైటీ స్కూల్ 550, ఆశ్రమ పాఠశాలలో 715, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 105 మంది విద్యార్థులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శాల పేరుతో పనులు చేయిస్తున్నాం. ఈ పనుల నిమిత్తం ఇప్పటి వరకు 10కోట్ల 77లక్షల నిధులు వచ్చాయి. మరిన్ని నిధులు రావాల్సి ఉంది. మొత్తం 973 పాఠశాలలను గుర్తించగా ఇందులో 150 పాఠశాలల్లో పనులు పూర్తికాగా నిర్వాహకులకు బిల్లులు సైతం చెల్లించేలా చూశాం. మిగిలిన వారికి పనులు పూర్తకాగానే బిల్లులు చెల్లిస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఉపాధ్యాయులు ఎంత మంది ఉన్నారు. ఇటీవల ఎంత మంది ఉపాధ్యాయులు వచ్చారు?

డీఈవో: జిల్లాలో మొత్తం మంజూరైన పోస్టులు 4,979. ఇందులో 4,043 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల 433 మంది ఉపాధ్యాయులు వచ్చారు. 910 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 1130 మంది ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాం. 2008 డీఎస్సీకి సంబంధించి ఉమ్మడి జిల్లాకు 200 మంది ఉపాధ్యాయులు రానున్నారు. ఇందులో జిల్లాకు 100 మంది వరకు వీరు సైతం వస్తే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరుతుంది.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో క్రీడల నిర్వహణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: జిల్లాలో క్రీడల నిర్వహణను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెరిగేలా చూస్తున్నాం. త్వరలో 14 సంవత్సరాల విభాగంలో ఖోఖో, యోగ, సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించాం. త్వరలో మరిన్ని క్రీడలు నిర్వహించేందుకు దృష్టి సారిస్తున్నాం.

పశువులకేదీ బీమా!?

● ఆరేళ్లుగా నిలిచిన బీమా పథకం ● ప్రతి యేటా మృతి చెందుతున్న పశువులు
● నష్టపోతున్న పశు పోషకులు ●పట్టించుకోని జిల్లా అధికారులు



కోటగిరి మండల కేంద్రంలో పశువులు

కోటగిరి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్న ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మారుతున్నాయి. పాడి పరిశ్రమను ఆధారంగా చేసుకుని ఎన్నో కుటుంబాలు జీవిస్తున్న పాడి పశువుల సంరక్షణకు మాత్రం ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా లక్షలాది రూపాయలు పెట్టి పశువులను కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటికి బీమా సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది.

జిల్లాలో పశువుల బీమా అమలు కాకపోవడంతో పశు పోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పటును అందించే వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం చేయూతను అందిస్తామని చెబుతున్న క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. గత ఆరేళ్లుగా పశువుల బీమా పథకం నిలిపివేయడంతో పశు పోషకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పాడి పశువులు అనారోగ్యం, ఇతర కారణాలతో మృత్యువాత పడుతుండడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

● ఆరేళ్లుగా నిలిచిన బీమా సౌకర్యం

పశు బీమా పథకాన్ని 2017, 2018వరకు గత ప్రభుత్వం అమలు చేసింది. ఆరేళ్లుగా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గ్రామీణ ప్రాంతాలలో పశువులు, రోడ్డు, విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా చనిపోతున్నాయి. మేలు జాతి పశువులకు రూ.లక్షల్లో డిమాండ్ ఉంది. అనివార్య కారణాలతో పశువులు మృతి చెందితే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. గతంలో బీమా కోసం యాజమాని కొంత చెల్లిస్తే ప్రభుత్వం కొంత మొత్తం జమ చేసేది. ఏదైన ప్రమాదంలో జీవాలు చనిపోతే ఆయా సంస్థల నుండి గతంలో పశువుల రకాన్ని బట్టి 50వేల రూపాయల వరకు పరిహారం అందేది. దీంతో పశువులు మృత్యువాత పడిన వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకుని భరోసాగా ఉండేవారు. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోవడంతో వివిధ కారణాలలతో పశువులు చనిపోతే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

● జిల్లాలో పశు సంపద వివరాలు

ఆవులు : 101252	గేదెలు : 206898
గొర్రెలు : 735549	మేకలు : 156679
ఇతర పశువులు : 1719576	

● యేటా జీవాల మృతి

జిల్లా వ్యాప్తంగా మొత్తం 29,19,894 పశువులు ఇతర జంతులు ఉన్నాయి. యేటా వందలకొద్ది పశువులు అనారోగ్య, పిడుగులు పడి రోడ్డు, రైలు ప్రమాదాల్లో మృతి చెందుతున్నాయి. పలుమార్లు డంపి స్కిన్ తదితర వ్యాధులు సోకి ఆవులు, ఎద్దులు మృత్యువాత పడుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పథకం పంపిణీలో పంపిణీ చేసిన గొర్రెలకు మాత్రమే బీమా వర్తింపజేసింది. ప్రస్తుతం గొర్రెలు, ఆవులు, ఎద్దులు, గేదెలకు బీమా సదుపాయం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రైవేటు బీమా కంపెనీలను ఆశ్రయించి బీమా చేయించాలంటే సుమారు 50వేల రూపాయల పశువుకు 4వేలు ఖర్చు అవుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమలు చేసి 50శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కోటగిరి డెయిరీలో పశువులకు ప్రైవేటుగా బీమా చేసిన ట్యాగ్‌ల దృశ్యం

బీమా పథకాన్ని పునరుద్దరించాలి



జిల్లాలో పశువులకు బీమా పథకాన్ని పునరుద్ధరించాలి. బీమా కోసం ప్రైవేటు కంపెనీలను ఆశ్రయిస్తే డబ్బులు అధికంగా ఖర్చు అవుతున్నాయి. ప్రైవేటుగా బీమా పథకం చేయించుకోకపోవడం వల్ల పశువులు మృత్యువాత పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతుల వాటా కలుపుకుని బీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలి.

- పత్తి సతీష్ (డెయిరీ ఫారం యాజమాని, కోటగిరి)

ప్రభుత్వానికి నివేదిస్తాం



ప్రభుత్వం పంపిణీ చేసిన పథకాల్లో లబ్దిదారులు పొందిన పశువులకు యూనిట్ విలువ నుండి బీమా సదుపాయం కల్పించింది. రైతుల వద్ద ఉన్న పశువులకు బీమా పథకం కల్పించలేదు. ప్రైవేటుగా బీమా చేసుకుంటే నష్టం జరిగినప్పుడు పరిహారం అందుతుంది. కొత్త ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేస్తే పశువులకు బీమా సదుపాయం కల్పిస్తాం.

- సురేష్ (పశువైద్య అధికారి, కోటగిరి)

డిసెంబర్ కల్లా సిలబస్ పూర్తి చేయాలి

● జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్



కోటగిరిలో కళాశాలలో తనిఖీ చేస్తున్న డీఐఈవో

కోటగిరి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో డిసెంబర్ నెలాఖరుకల్లా సిలబస్ పూర్తి చేయడంతో పాటు ప్రాక్టికల్స్ క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ సూచించారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని సూచించారు. ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు డిసెంబర్ కల్లా సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యతతో కూడిన శిక్షణ, ఉపాధి కోసం ప్రవేశపెట్టిన నూతన కోర్సులను నిజామాబాద్, బిచ్కుంద కళాశాలల్లో ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను ఐటీఐలో చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కైసర్ పాషా, లెక్చరర్‌లు ప్రమోద్, దత్త్రాత్రి తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఇవ్వాలని మోస్రాలో ధర్నా

మోస్రా,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో రైతుబంధు ఎగవేతపై నిరసనగా మోస్రా మండల బీఆర్ఎస్ నాయకులు నిజామాబాద్,బాన్సువాడ ప్రధాన రహదారిపై గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసి రైతుబంధు ఇవ్వకుండా రైతులను బాధపెడుతుందని భారాస నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని ప్రజల పక్షాన పోరాటం చేయడం భారాస కార్యకర్తలకు కొత్త కాదని ప్రజల పక్షాన ఎప్పుడు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పసుల ప్రశాంత్, కొత్తిమీర్‌కర్ విజయ్, షేక్ అలీమ్, గొల్ల ప్రశాంత్, కొండెపు గణేష్, అఫ్సర్, గంధపు విజయ్, షేక్.బాబా, ఆరెపల్లి సాయి, అర్షద్, గొల్ల నరేందర్, గొల్ల లక్ష్మణ్, హమీద్ అల్మాస్, కరీం, మక్బుల్ పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణ సామాజిక బాధ్యత

● ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ జవహర్‌రెడ్డి
● అన్మాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో ముగిసిన వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ
● పాల్గొన్న ఖమ్మం, నిజామాబాద్, మహబూబాబాద్ పీడీలు, పీఈటీలు



సదస్సులో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

కడ్తాల్ , అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవకోటికి ప్రాణాధారమైన నీటిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ కె.ఎస్ జవహర్ రెడ్డి అన్నారు. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామంలోని దీ ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్,యంగ్ ఎర్త్ లీడర్స్ నాలుగో బ్యాచ్ అవగాహన కార్యక్రమం గురువారం ముగిసింది. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు కోఫౌండర్ లీలాలక్ష్మారెడ్డి ల అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఏపీ మాజీ సీఎస్ జవహర్ రెడ్డి, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త కె. పురుషోత్తం రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కన్వీనర్ మాదవ రెడ్డి, చైర్మన్ రవీందర్‌రావు, ప్రముఖ విద్యావేత్త ఉపేందర్‌రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఖమ్మం, నిజామాబాద్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 80 వ్యాయామ ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జవహర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి , పర్యావరణం, జీవరాశుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే మానవాళి మనుగడను ప్రమాదమన్నారు. జీవ వైవిధ్యప్రాముఖ్యాను ప్రతి పౌరుడు గుర్తించాలని ఆయన సూచించారు.శారీరక శ్రమ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ యానాల వెంకట్ రెడ్డి, ప్రతినిధులు అనుదీప్, నగేశ్, శంకరయ్య, లక్ష్మీప్రసన్న, హరిత, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్న దృశ్యం

బోధన్‌రూరల్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి వైకుంఠ ధామం పరిసరా ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 2కిలోల 50గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామని బోధన్ రూరల్ ఎక్సైజ్ సీఐ పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పకడ్బంది సమాచారం మేరకు పట్టణ శివారులోని బైపాస్ ప్రాంతంలో గల హిందు శ్మశాన వాటిక తదితర ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలపై వస్తున్న షేక్.సబర్ మియా, శంకర్‌లను తనిఖీ చేయగా వారి వాహనంలో 2కిలోల 50గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. నిందితులది రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామమన్నారు. గంజాయిని అక్రమ రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైకుంఠ ధామ పరిసరాలలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న సమాచారం రావడంతో పకడ్బందిగా పట్టుకోవడం జరిగిందన్నారు. వారిని కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

● గుట్కాలను విక్రయిస్తే కఠిన చర్యలు

బోధన్‌రూరల్: పాన్ షాప్, కిరాణ షాప్, ఇతర షాపుల్లో వ్యాపారస్తులు అక్రమంగా గుట్కాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ పట్టణ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో గుట్టుగా విక్రయిస్తున్న గుట్కా వ్యాపారస్తులపై తనిఖీ నిర్వహించామని, 10వేల రూపాలయ గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సాగర్, పాన్ మాసాల 20ప్యాకెట్, ముసాఫిల్ పాన్ మాసాల 15ప్యాకెట్లు, రాయల్ జాఫర్ జర్దా, జాఫ్రన్ జర్దా, సుగంధి తంబాకు, నివాస్ మాసాల, ఆర్ఎండీ వంటి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని, వీటిని అమ్మిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇక నుండి పట్టణంలో ఎవరైన అక్రమ గుట్కా విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● యాంటీ డ్రగ్స్ బ్యూరో ఏసీపీ సోమనాథం



బోధన్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాంటీ డ్రగ్స్ బ్యూరో ఏసీపీ సోమనాథం అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు బానిస కావద్దని, గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదకద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి బానిసలు కావద్దన్నారు. చెడును విస్మరించి మంచిని ప్రోత్సహిస్తూ ఉన్నత చదువులు చదివి స్వశక్తితో తమకు తాము ఎదిగి ఇతరులకు చేయూత అందించాలన్నారు. భవిష్యత్ తరాల వారికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఎక్కడైన అన్యాయం జరిగిన, గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు జరిగిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వివరాలు అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వారికి రక్షణ కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. గంజాయి విక్రయించిన, సేవించిన కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు బాగా చదివి ఎలాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిపెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ పూర్ణేశ్వర్, పట్టణ సీఐ వెంకట నారాయణ, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, పోలీసుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల మూల మలుపు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ఫకీరాబాద్‌కు చెందిన ఒడ్డె గంగాధర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.నిజామాబాద్ నుంచి గంగాధర్ బైక్‌పై తన స్వగ్రామానికి వెళ్తుండగా మోడల్ పాఠశాల మూల మలుపు వద్ద ఉన్న స్పీడ్‌బ్రేకర్‌ను గమనించని ముందుగా వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు వెనుకనే ఉన్న బైక్ కారును ఢీకొని కింద పడడంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారువెనుక అద్దాలు సైతం పగిలిపోయ్యాయని వారు వివరించారు. వెంటనే బాధితుడిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలి

● జడ్పీసీఈవో ఉషా

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని జడ్పీసీఈవో ఉషా గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. బాబాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం లింబాద్రిగుట్టపై వెలిసిన లక్ష్మీనర్సింహ స్వామి వారిని దర్శనం చేసకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేవారు. ఆమె వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో జావిద్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

నందిపేట, అక్టోబరు24: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వ ర్యం లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కా ర్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో దేవన్న, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులుఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినిలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, సభ్యులు అంబల్ల తిరుపతి, బైరి శ్రీధర్, శశిధర్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో మాజీమంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం



పెర్కిట్‌లో మాజీమంత్రి కేటీఆర్‌కు ..

ఆర్మూర్ రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో జాతీయరహదారిపై గురువారం మాజీమంత్రి కె.తారక రామారావు బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి నిర్మల్ వెళ్తున్న కేటీఆర్‌ను కొద్ది సేపు ఆపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పూజ నరేందర్, ఇ.గంగాధర్, వెల్మల్ రాజన్న, తదితరులు ఉన్నారు.

దొన్కల్ చెరువులో భారీగా చేపల మృతి



దొన్కల్‌లో మృతి చెందిన చేపలు పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

మోర్తాడ్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన ఊర చెరువులో సుమారు రెండు టన్నుల చేపలు మృతి చెందాయని గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తెలిపారు. గ్రామ శివారులోని చెరువులో ఊరు మురికినీరు చెరువులోకి చేరడంతో నీరు మలినమైనపోయిందని, అంతేగాక చెరువు తూములు తెరువక పోవడం వల్ల నీరు కలుషితం చేపలు చనిపోయాయని గంగ పుత్రులు వాపోయారు. ఈ విషయంపై మండల తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ వినతి పత్రం అందజేశారు. తమకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం చేయాలని కోరారు. గ్రామానికి చెందిన గంగపుత్రులు ఈ చెరువుపైనే ఆదరపడి బతుకుతున్నామని తెలిపారు.ఈ విషయంపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ సుజాత చెరువును సందర్శించారు. ఈవిషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ

● మహారాష్ట్ర ఎన్నికల వేళ భారీ బందోబస్తు



చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు బ్రిడ్జికి రెండు వైపులా పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశంతో భారీ బందోబస్తు, వాహనాల తనిఖీల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు తెలిపారు. గురువారం రాత్రి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా మహారాష్ట్ర వైపు వెళ్లే ప్రజలు డబ్బులు అధికంగా తీసుకెళ్లే వద్దన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు ప్రతీ ఒక్కరు తప్పకుండా పాటించాలన్నారు. మహారాష్ట్ర నుంచి బోధన్ వైపు వస్తున్న వాహనాలను సైతం తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు అవసరమైన డబ్బులను మాత్రమే తీసుకెళ్లాలని, ఎన్నికల నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు.

గ్రంథాయాన్ని పరిశీలించిన రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్



ఆర్మూర్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రియాజ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల్లోని నిరుద్యోగులు, పాఠకులతో మాట్లాడి వసతుల గురించి అడిగితెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న మొదటి అంతస్తు భవనాన్ని పరిశీలించి త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. టాయిలెట్ల నిర్మాణం అయ్యే వరకు మున్సిపల్ వారు నిర్మించిన టాయిలెట్లకు నీటి సౌకర్యం కల్పించి వినియోగం తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్‌లను విడుదల చేస్తారని, పుస్తక పఠనంతో పాటు జనరల్ నాలెడ్జి పెంపొందించుకోవాలని నిరుద్యోగులకు, పాఠకులకు సూచించారు. గ్రంథాలయానికి వచ్చేవారి సంతకాల బుక్‌తో సలహా బుక్ పెట్టాలని, లైబ్రేరియన్ వరలక్ష్మీకి సూచించారు.

చోరీకి పాల్పడ్డ వ్యక్తికి జైలు

ముప్కాల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని శ్రీరాంపూర్ గ్రామంలోని ఆలయంలో, లింగమయ్య ఆలయంలో దొంగతనం జరిగిన కేసులో రూ.1000 జరిమానా, ఒకరికి సంవత్సరం జైలు శిక్షను ప్రథమశ్రేణి న్యాయాధికారి వేముల దీప్తి తీర్పు వెలువరించినట్టు బాల్కొండ ఎస్సై బి.నరేష్ తెలిపారు.చిట్టాపూర్‌కు గండికోట గంగాధర్‌తో పాటు సందీప్ 11నవంబరు 2022 అర్ధరాత్రి బాల్కొండ మండలంలోని లింగమయ్య ఆలయం, చిలుక చిన్నమ్మ ఆలయంలో హుండీ పగులగొట్ట డబ్బులు, వెండి వస్తువులు దొం గిలించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం చార్జీషీట్ కోర్టుకు దాఖలు చేయడంతో గురువారం తీర్పు వెలువరించినట్టు ఎస్సై బి.నరేష్ తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో చిత్తరి లక్ష్మీ అనే మహిళ ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో చోరబడి బీరువలో ఉన్న మూ డు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును ఎత్తుకెళ్ళినట్టు ఎస్సై మహేష్ తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మత్స్యకారులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు స్వామి

జక్రాన్‌పల్లి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలను అందించి వారికి ఉపాధి కల్పించి వారిని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యామని జిల్లామత్స్యశాఖ అధికారిఆంజనేయులు స్వామి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లిలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లలను ఆయన పంపిణీ చేశారు.అనంతరం చేపపిల్లలను గంగ పుత్రులు వారి చెరువుల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంపీడీవో సతీష్‌కు మార్, జిల్లా చీఫ్ ప్రమోటర్ శ్రీనివాస్, ప్రమోటర్ భాస్కర్, మండల మత్యశాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, గ్రామాల మత్స్యశాఖ సొసైటీ సభ్యులు, కార్యదర్శు లు, మత్స్యకారులు పాల్గొన్నారు.

సిద్దిపేట్‌లో మున్సిపల్ సిబ్బందికి అవగాహన

భీమ్‌గల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గురువారం సీడీఎంఎ చైర్‌పర్సన్, కమిషనర్ మేనేజర్‌ల ఆదేశాల మేరకు సిద్దిపేట మున్సిపాలిటీ సందర్శనలో స్వచ్ఛ బడి కెపాసిటీ డోర్ టూ డోర్ గర్బజ్ కలెక్షన్ బయో సీఎస్‌జీ విండ్రో కంపోస్టింగ్, డీఆర్‌సీసీ మెయింటనెన్స్ ఐటీసీ పోడి చెత్తను తడి చెత్తను ఎలా ఉపయోగించాలి ఎలా స్టోర్ చేయాలి చెత్తతో ఎలా గ్యాస్ తయారు చేయొచ్చునో డీఆర్‌సీసీ సెంటర్‌లో పరికరాలను ఎలా వాడాలో సిద్దిపేట మున్సిపాల్ కార్పరేషన్, సీడీఎంఎ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భీమ్‌గల్ మున్సిపాలిటికీ చెందిన జూనియర్ అసిస్టెంట్ నవీన్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సున్నపు ఓంకార్, డ్రైవర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

టీయూకి న్యాక్ గుర్తింపునకు సిద్ధం కావాలి

● హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశంలో టీయూ వీసీ

డిచ్‌పల్లి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాసంస్థలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థికపరమైన మద్దతుకు న్యాక్ అక్రిడేషన్ తప్పనిసరి అయిందని, టీయూ వీసీ ప్రొ.యాదగిరి రావు పేర్కొన్నారు. గురువారం పరిపాలన భవనంలోని ఎక్స్‌క్యూటివ్ హాల్‌లో వర్సిటీ విభాగాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీలో మౌలిక వసతుల కల్పన, బోధన సిబ్బంది, పరిశోధనలకు అవసరమైన ప్రాజె క్టులకు నిర్వహనకు ల్యాబ్‌ల ఏర్పాటుకు, విద్యార్థుల పెలోసిప్‌కు న్యాక్ గుర్తిం పు అనివార్యం అయిందని, ఈ విషయం విభాగాధిపతులు గుర్తించాలన్నారు. గుర్తింపుతో వర్సిటీలకు భవన నిర్మాణ గ్రాంట్ లతో పాటు మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక మద్దతు పొందవచ్చునన్నారు. రిజిస్ట్రార్ యాద గిరి మాట్లాడుతూ..అధ్యాపకులు వర్సిటీ అభివృద్ధిలో పాలు పంచుకొని న్యాక్ గుర్తింపు కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రొ. ఆరతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్, కంట్రోలర్ అరుణ, ఐక్యూఏసీ డైరెక్టర్ అడి కే నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వీసీని సన్మానించిన స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ

టీయూ వీసీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.యాదగిరి రావును గురువారం జిల్లా స్పెషల్ బ్రాంచ్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

● మెయిన్ క్యాంపస్‌లో వీసీ ఆకస్మిక తనిఖీలు

టీయూ మెయిన్ క్యాంపస్‌లో గురువారం వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరితో కలిసి కళాశాలను, విభాగాలను పరిశీలించారు. బోధన జరుగుతున్న తీరును స్వయంగా పర్యవేక్షించారు. విధులపట్ల నిర్లక్ష్యంవహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

ప్రమాదకరంగా ప్రాజెక్టు రహదారి...

ఆదమరిస్తే ప్రాణాలు గాల్లోకి..

'ఆంధ్రజ్యోతి' ఫోకస్



ప్రధాన రహదారి గోల్ బంగ్లా వద్ద రేయిలింగ్ లేని దృశ్యం

- పట్టింపు లేని పాలకులు అధికారులు
- 2021లో ఆదరాబాదరగా బీటీ రోడ్డు మరమ్మతులు
- నిజాంసాగర్ ప్రాజెక్టు ఘాట్ రోడ్డుకు సైడ్ రేయిలింగ్ లేని ఘాట్ రోడ్డు
- ఫిషరీస్ ఆఫీస్ నుంచి మాసంపల్లి ఎక్స్ రోడ్డు వరకు ఇదే పరిస్థితి
- రహదారిపై ఎక్కడ పడితే అక్కడ గుంతలు
- ప్రాజెక్టు రహదారి, వీఐపీలు వెళ్లే రహదారి దుస్థితి

నిజాంసాగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న నిజాం సాగర్ ప్రాజెక్టు రహదారులు ప్రమాదకరంగా మారిన పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆరోపణలు వినిస్తున్నాయి. ఆనాడు నైజాం నవాబు లు నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మాణం చేపట్టి జాతికి అంకితంచేశారు. ఉభయ జిల్లాలోని 323 గ్రామాల సాగు భూములకు సాగు నీరు అందించి ధాన్యాకారంగా పేరు ప్రఖ్యాతిగాంచిన ఇదే నిజాంసాగర్ ప్రాజెక్టు అని చెప్ప వచ్చు. ప్రభుత్వాలు పాలకులు మారుతున్న నిజాంసాగర్ రూపు రేఖలు మారడం లేదని ఉభయ జిల్లాల రైతులు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన రహదారి అయిన నిజాంసాగర్ కూడలి నుంచి మాసాన్‌పల్లి ఎక్స్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్న స్థితికి చేరుకుంది. ఈ రహదారి వెంట వాహనదారులు, పాదాచారులు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు ప్రజలు ఆవేదన చెందుతూ ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన రహదారి అయిన ఫిషరీస్ ఆఫీస్ నుంచి మాసన్‌పల్లి ఎక్స్ రోడ్డు వరకు ఉన్న రహదారి గుంతల మయమై రాకపోకలకు ఇబ్బందులు కల్పిస్తున్న నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాలకులు చూసి చూడ నట్టుగా వివరిస్తూ ఉండటంతో రహదారి వెళ్లే వాహన దారులు ప్రజలు ఆదమరిస్తే ప్రాణాలు గాల్లోకి వెళ్లాల్సిందే. నిజాంసాగర్ ప్రాజెక్టుపై నుంచి ఉన్న ఈ రహదారి ఎక్కడ పడితే అక్కడ గుంత పడినప్పటికీ మరమ్మతులు చేయాలని కనీస ఆలోచన అధికారులకు లేకపోవడం గమనార్హం. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి మాసాన్‌పల్లి ఎక్స్ రోడ్డు వరకు ఉన్న ఈ రహదారి వెంటనే వీఐపీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెళుతూ ఉన్నకం టికి కానరాకుండా పోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్త మవుతున్నాయి. గోల్ బంగ్లా క్రాసింగ్‌లో రోడ్డు ఇరువైపు లా కయ్యలు పడటంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఫిషరీస్ క్రాసింగ్ నుంచి నిజాంసాగర్ ఘాట్ రోడ్డు వరకు ఉన్న ఇరువైపులా రేలింగ్ లేకపోవడంతో ప్రజలు, వాహన దారులు అనేక పాట్లు ఎదుర్కొవాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. 2021లో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిజాం సాగర్ ప్రాజెక్టు సందర్శనకు వస్తారని ఖరారు కావడంతో నీటి పారుదల శాఖ రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రాజెక్టు రహదారులను ఆదరాబదరగా బీటీ రోడ్డు మరమ్మతులు చేసి చేతులు దులపుకున్నారనే తప్ప మరమ్మతులు చేసిన రహదారి మున్నాలకే బీటలు వారడమే కాకుండా గుంతలు పడటం విశేషం. రాష్ట్ర రాజధానిలో ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న నిజాం సాగర్‌పై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పట్లో ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కాకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి మరమ్మతులు చేపట్టి బిల్లులు చెల్లించారని విమర్శలు ఉన్నప్పటికీ విమ ర్శలను తుంగలో తొక్కారని తెలుస్తుంది. ఇప్పటికైనా రాజ. దానిలోని ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న నిజాం సాగర్ ప్రాజెక్టు ప్రధాన రహదారులతో పాటు ఘాట్ రోడ్డు ను చూడముచ్చటగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



'ఆంధ్రజ్యోతి' ఫోకస్

నిజాంసాగర్ ప్రాజెక్టు గుంతలమయమైన దృశ్యం



నిజాంసాగర్ ప్రాజెక్టు వీఐపీ రహదారి ఇదే



ఘాట్ రోడ్డు ఇరువైపులా రేయిలింగ్ లేని దృశ్యం

ఆర్టీసీ డ్రైవర్లకు తప్పని తిప్పలు

- దుబ్బాక, బీబీపేట, పెద్దమాల్లారెడ్డి వైపు విధులు నిర్వహించే డ్రైవర్‌లకు తప్పని కష్టాలు
- టోల్‌గేట్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం

దోమకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):ప్రజలకు అన్ని రాకలుగా వసతులు ఉండాలనే ముందు చూపుతో పాలకులు సౌకార్యాలను మేరుగు పరుస్తుంటారు. కానీ దోమకొండ, దుబ్బాక మండాలలకు ప్రయాణాలు సాగించే ఆర్టీసీ బస్సులు,ప్రజల కష్టాలు పాలకులకు కనబడటం లేదా అనిప్రతి రోజు కామారెడ్డి వైపు ఇంటర్ చదివేందుకు వెళతున్న విద్యార్థిని, విద్యార్థుల ప్రశ్నలు..కళాశాల సమయాల్లో బీబీపేట రూట్‌లో సరైన సమయంలో బస్సులు నడపడం లేదని సమయానుకూలంగా బస్సులను వేసి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని బీబీపేట మండల కాంగ్రెస్ నాయకులు సుతారి రమేశ్ గత రెండు రోజుల క్రితం కామారెడ్డి ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. కానీ విద్యార్థులు కళాశాలకు వెళ్లడానికి అష్టకష్టలు పడుతున్నారు. దోమకొండ, బీబీపేట, మాందాపూర్, దుబ్బాక, మాల్యాపూర్, యాడారం, ఇస్సానగర్, పెద్దమాల్లారెడ్డి, తుజాల్‌పూర్ వైపు నుంచి వెళ్లే బస్సుల్లో ప్రయాణీకులతో పాటు విద్యార్థులు నిండిపోతున్నారు. బస్సుల్లో డోర్ వద్ద నిలబడి ప్రయాణాలు చేస్తున్నారు. డ్రైవర్, కండక్టర్‌లు సైతం అలా ప్రయాణం మంచిది కాదని వారించిన వేనుకాల వచ్చే బస్సుల్లో ఇంకా ఎంత మంది వస్తున్నారో తమకు స్థలం ఉంటుందో లేదో అని ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు చేసే ట్రిప్‌లో డ్రైవర్ కండక్టర్‌లు అరచేతిలో ప్రాణంతో విధులు నిర్వహిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో టోల్‌గేట్ వద్ద బస్సు మలుపు తిరగాలంటే పూర్తిగా ఎడమవైపుకు వచ్చి కుడివైపునకు యూటార్న్ తీసుకుంటున్నారు. ఆ సమయంలో డోర్‌లో నిలబడిన విద్యార్థులు ఎక్కడ కింద పడిపోతారో అని డ్రైవర్లు భయంతో విధులు నిర్వహిస్తున్నారు.

దే సమయంలో ఒకే అనుకుంటే..

రాత్రి సమయంలో భయం భయం..

కామారెడ్డి నుంచి బీబీపేట, పెద్దమాల్లారెడ్డి, తుజాల్‌పూర్‌తో పాటు వివిధ గ్రామాలకు ఉదయం నుంచి రాత్రి వరకు మూడు నుంచి నాలుగుకు పైగా ట్రిప్పులు చేస్తుంటాయి. అయితే సాయంత్రం వరకు డ్రైవర్ కండక్టర్‌ల కమ్యూనికేషన్‌తో టోల్‌గేట్ వద్ద మలుపుతీసుకుంటున్నారు.రాత్రి సమయంలో డ్రైవర్‌లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అసలే నేషనల్ హైవే కార్లు, భారీ వాహనాలు స్పీడుగా వస్తుంటాయి. బస్సు మలుపు తీరగాడానికి కనీసం 5 సెకండ్ల నుంచి 8 సెకండ్ల వరకు సమయం పడుతుంది. కానీ దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాదారులు 80 స్పీడుతో వస్తుంటాయి. కంటి చూపు దూరంలో ఉన్న వాహనాలు సెకండ్లలో దగ్గరకు చేరుతుంటాయని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు.జరగరానిది జరిగితే తమనే బాధ్యతలను చేస్తారనే బాధలో డ్రైవర్లు, కండక్లర్లు మనోవేదనకు గురౌతున్నారు.

పట్టింపులేని పాలకులు..

దోమకొండ వైపునకు వేళ్లే దారి వద్ద నేషనల్ హైవే రోడ్డులో బ్రిడ్జి చిన్నగా ఉంది. రోడ్డు పనులు చేపట్టే సమయంలోనే పాలకులు ఇంద ల్వాయి వద్ద ఏర్పాటు చేసినట్లు బీటీఎస్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడితే బస్సుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని ఇక్కడి ప్రజలు పాలకులపై మండిపడుతున్నారు. దోమకొండ రూట్‌లో వేళ్లే దారిలో పీజీ క్యాంపస్ ఉంది. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి పీజీ క్యాంపస్‌లో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే బీటీఎస్ నుంచి దుబ్బాక, సిద్దిపేట, సిరిసిల్ల, ప్రాంతాల వైపుకు ప్రతి రోజు పెద్ద ఎత్తున వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.పాలకులు పట్టించుకుని బీటీఎస్ వద్ద బ్రిడ్జిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని దోమకొండ, బీబీపేట ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ఎస్పీలు సైతం ఇక్కడి రూట్‌పైనే దృష్టి

జిల్లా పోలీసు బాస్‌లు సైతం దోమకొండ రూట్‌పైనే ప్రత్యేక దృష్టి పెడుతుంటారు. గతంలో ఎస్పీగా శ్వేతారెడ్డి ఉన్న సమయంలో దోమకొండ వైపు నుంచి కామారెడ్డి వైపునకు వెళ్లేందుకు బీటీఎస్ వద్దకు రాగానే ఆర్టీసీ బస్సులతో పాటు ప్రవైటు వాహనాలు సుమారు అర కిలోమీటర్ దూరం వరకు రాంగ్‌రూట్‌లో వెళ్లేవి. దీంతో బీటీఎస్ చౌరస్తాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. ఆమె రాంగ్ రూట్‌లో వెళ్లకుండా స్థానిక పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా కూడా రాంగ్ రూట్‌లోనే ఆర్టీసీ బస్సులు, వాహనదారులు ప్రయాణాలు కొనసాగిస్తుండటంతో బీటీఎస్ వద్ద రోడ్డును మూసివేశారు. అలాగే దోమకొండ వైపు నుంచి మరో దారి గుండా కొందరు ప్రయాణాలు కొనసాగిస్తూ జంగంపల్లి వద్ద క్రిష్ణామందిర్ వరకు రాంగ్ రూట్‌లో వెళ్లి నేషనల్‌హైవే రోడ్డుకు వెళ్లేవారు. క్రిష్ణా మందిర్ వద్ద సైతం పలువురు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. వెంటనే అప్పటి ఎస్పీ శ్వేతారెడ్డి వివిధ శాఖల అధికారులతో కలసి ప్రమాదాలు జరిగే స్థలాలను, రాంగ్ రూట్‌లలో వచ్చే రోడ్లను గుర్తించి అక్కడ బారీగేడ్లు పెట్టి మూసివేశారు.

జర దేఖో



భిక్కనూర్ టోల్‌గేట్ వద్ద నుంచి మలుపు తీసుకుంటున్న డ్రైవర్



మలుపు తీసుకునే సమయంలో హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలకు అడ్డుగా మారిన బస్సు

జీ అలర్ట్



యువతరాన్ని వెంటాడుతున్న ఆన్‌లైన్ గేమ్స్

- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- ఆన్‌లైన్ గేమ్స్‌ను ఆకర్షిస్తున్న యువతరం
- అప్పులపాలై అప్పులు తీర్చుకోవడానికి విదేశాలకు యువతరం
- యువతరాన్ని అధికారులు అరికట్టాలని కోరుతున్న మెండోర ప్రజలు

మెండోర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ గ్రామంలో విద్యార్థి తన తండ్రి గల్ఫ్ దేశం వెళ్ళి కష్టపడి సంపాదించి తల్లి ఖాతాలోకి డబ్బులు పంపితే ఆ విద్యార్థి తల్లికి తెలువకుండా ఏటీఎం కార్డు తీసుకువెళ్ళి డబ్బులు డ్రా చేసి ఆన్‌లైన్ గేమ్స్‌కు మారకద్రవ్యాలకు అలవాటు పడి ఉన్నదంతా కాజేసిన సంఘటన ఒకటైతే. ఇంకో గ్రామంలో తన చిరువ్యాపారంలో డబ్బులో రాగానే ఆ డబ్బులను ఫోన్ పే ద్వారా వేసుకొని ఆ డబ్బులతో ఆన్‌లైన్ జూదం ఆడుతూ రూ.10లక్షల వరకు అప్పు చేసి వ్యక్తి ఇంకోకరు ఇలా ఉన్న భూములను సైతం అమ్ముకొని గల్ఫ్‌దేశాలు వెళ్ళిన యువతరం ఇంకొందరు. ఇలా రోడ్డున పడుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయని మండలంలో యువతరాన్ని అరికట్టడానికి సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని అనవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని..

ప్రస్తుత రోజుల్లో యువతరం చాలా ముందుకు వెళ్ళిపోతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలను అర్జించాలని ఆన్‌లైన్ జీవితానికి మారక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను కుటుంబాన్ని నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ జూదంలో రూ.1000నుంచి రూ.10వేలు వస్తాయని ఆశపడి లక్షలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మండలంలో ఓ గ్రామంలో యువకుడు ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడి తల్లి చెల్లెపై ఉన్న బంగారు గొలుసులు తాకట్టుబెట్టి రూ.15లక్షల అప్పు చేసి ఉన్న భూములను అమ్ముకొని తమ జీవితాన్ని అతలాకుతలం చేసుకున్నారు.

కరోనా మహమ్మారి నుంచి అలవాటు పడ్డ యువత..

కరోనా మహమ్మరి వచ్చినప్పటి నుంచి ఆన్‌లైన్ జూదంపై యువతరంలో ప్రజల్లో ఎక్కువగా ఆసక్తి ఏర్పడిందని ఆది ఇప్పుడు మండల వ్యాప్తంగా యువతారాన్ని అతలాకుతలాన్ని చేస్తుందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీఒక్కరు ఏదో ఒక పని చేస్తూ పొద్దాక సంపాదించిన డబ్బులను సాయంత్రం సమయంలో, రాత్రి సమయంలో ఆన్‌లైన్ గేమ్స్‌లలో డబ్బులు పెట్టి పొగొట్టుకుంటున్నారని సమాచారం. మండల వ్యాప్తంగా జోరుగా వినిపిస్తున్నాయి. జీవితానికి అలవాటు పడిన యువతరం ఎంత అప్పుకైనా సిద్దపడుతున్నారని వారం వడ్డీకి నెల వడ్డీకి రూ.10నుంచి 20శాతం వడ్డీలతో అప్పులు తీసుకుంటున్నారని, మండలంలో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం ఆన్‌లైన్ గేమ్స్ కోరకే అప్పులు తీసుకుంటున్నారని వాదనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్ గేమ్స్ పూర్తిగా మోసపూరితమైందని, ఎవ్వరు కూడా ఆన్‌లైన్ గేమ్స్ ఆడకూడదని అప్పుల పాలు కొవోద్దని కుటుంబాలను రోడ్డున పడే కూడదని సంబంధత ఉన్నతాధికారులు యువతారాన్ని మేల్కొల్పుతున్నారు.

అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది..

యువతరం మారకద్రవ్యాల పైన జూదం జైన దృష్టి సారించకుండా భవిష్యత్ నిర్మాణం కోసం తమ తల్లిదండ్రులు కోసం శ్రమించి పోరాడి గెలవాలని సమాజంలో తనకుంటూ ఒక పేజీని రాసుకోవాలని తమ తల్లిదండ్రులు గర్వపడేలా ఏదైనా ఒక మంచి కార్యాన్ని చేసి గర్వంగా సమాజంలో తలెత్తుకొని తిరిగే విధంగా చూడాలని తల్లిదండ్రులు ఉన్నతాధికారులు యువతరానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా యువతరం జీవితానికి మారక ద్రవ్యాన్ని వదిలివేయాలని కొన్ని కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు, స్నేహితులను ఆత్మీయ బంధువులను పిలిచి యువతరానికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్ వల్ల కొన్ని కుటుంబాలు లక్షలకు అప్పులు చేసి తీర్చలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకున్న సం ఘటనలు సైతం ఉన్నాయని అటువంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా ముందుగానే ఎవరైనా మారకద్రవ్యాన్ని జీవితానికి అలవాటు అయినట్లుయితే ఇప్పటికైనా మానివేసుకొని తమ కుటుంబాలతో సంతోషంగా గడపాలని తమ పిల్లలను సరైన మార్గంలో పెంచాలని, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండే విధంగా మండలాన్ని యువతరం తీర్చిదిద్దాలని పలువురు తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కి అలవాటు పడకుండా యువకులను అరికట్టాలి..

● పల్లె లింగారెడ్డి, యువకుడు

ప్రస్తుత పరిస్థితిల్లో యువకులు ఆన్‌లైన్ గేమ్స్‌కి అలవాటు పడి తమ జీవితాలన నాశనం చేసుకుంటున్నారు. అటువంటి యువకులపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అరికట్టాలని లేదంటే తమ కుటుంబాల జీవితాలు చిన్నబిన్నం అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఆన్‌లైన్ మారకద్రవ్యలకు అలవాటుపడ్డ యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన వాళ్లను కఠినంగా శిక్షించాలి



బిచ్కుందలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బిచ్కుంద,అక్టోబరు 24:హిందూదేవాలయాలపై దాడులను వ్యతిరేకిస్తూ హిందూ సంఘాల బిచ్కుంద బంద్‌కు పిలుపునివ్వగా గురువారం ప్రశాంతంగా కొనసాగింది.మండల కేంద్రంలోని గణేష్ మందిరం నుంచి పాతబస్టాండ్, గాంధీచౌక్,ఉరాడమ్మ, మఠం గల్లి, కిందిగల్లి, కమ్మరిగుడి, గుర్రం,కలాల్లి చౌరస్తా, కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిచ్కుంద సద్గురు బండాయప్ప స్వామి మఠాధిపతి సోమలింగశివాచార్యులు మాట్లాడుతూ సనాతన ధర్మంతోనే సృష్టి వేయిఏళ్ల కిందనే ప్రారంభమైనట్లు తెలిపారు. భారతదేశ సంస్కృతికి కట్టుబడి ఉండి ఐక్యమత్యంతో అందర్ని కలుపుకుపోయే గొప్ప వ్యక్తిత్వం గత హిందూధర్మం అని తెలిపారు. అలాంటిది దేశం రాష్ట్రాలలో హిందూ దేవాలయాలపై దాడులు చేస్తు మనోభావాలను దెబ్బతీసేలా దాడులు చేస్తున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ,కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల ప్రతినిధులు,హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ గ్రామ శివారులో బుధవారం రాత్రి పోలీసులు దాడి చేసి 8 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. మండలంలో పేకాట ఆడకూడదని ఎవరైనా పేకాట ఆడుతు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

ట్రాన్స్‌కో ఏఈగా గోపికృష్ణ

మద్నూర్,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల ట్రాన్స్‌కో ఏఈగా గోపి కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మద్నూర్ ఏఈగా ఉన్న అరవింద్ బదిలీపై వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో కామారెడ్డి ట్రాన్స్‌కో ఏఈని మద్నూర్ ఏఈగా నియమించారు. గురువారం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్‌కు సంబంధించిన పథకాలను వినియోగదారులకు తెలియజేస్తామని వారు సహకరించాలని కోరారు.

శనగ పంట సాగు కోసం రైతుల పాట్లు

బిచ్కుంద,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):భూమిలో శనగపంటకు ఆశించినంత మేర తడి తేమశాతం లేకపోవడంతో శనగ పంటల సాగుకోసం రైతులునానా అవస్థలు పడాల్సి వస్తుంది. సోయా పంటలు రైతులకు ఆశించిన మేర దిగుబడి వచ్చింది. పంటపొలాల్లోంచి సోయారాశి చేసుకున్న రైతులు శనగ పంటల సాగుకోసం చెరువులు అలుగు కాలువలలో ప్రవహించే నీటిని ట్రాక్టర్ కు,మోటార్‌ను బిగించి స్పినర్ల ద్వారా శనగకు నీటి తడి అందివడం జరుగుతుంది. అలాగే చుట్టుపక్కల బోరు బావులు కలిగిన రైతులు శనగ,కంది పంటలకు పైపుల ద్వారా స్ప్రింక్లర్ల అమర్చి పంటలకు నీరు అందిస్తున్నారు. రైతులు సాగుచేసే పంటలు కాపాడుకునేందుకు రైతులది మానవ ప్రయత్నమేనని ఆ దేవుడు కనుకరించి మూడునెలల శనగ పంట కాలములో ఒకటి,రెండుసార్లు మోస్తారు వర్షం కురిపించాలని రైతులు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భువనేశ్వర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా పోలీసుల వెపన్స్ పనితీరు, పోలీస్ సిబ్బంది విధులతో పాటు, అత్యవసర సమయాలలో డయల్ 100 పనితీరును వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది బందగిసా, ప్రతిభలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య నివారించేందుకు చర్యలు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలోని డైలీమార్కెట్, సుభాష్‌రోడ్డులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు చిరు వ్యాపారులు రోడ్డు మీద ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చిరు వ్యాపారులు రైతుబజార్‌లో ఉన్న స్థలాలలో పెట్టుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సుజాత, ఎస్ఐ శ్రీరాం, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళాశాలకు రెగ్యులర్‌గా వచ్చేలా తల్లిదండ్రులు కృషి చేయాలి

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కళాశాల ఆవరణలో నిర్వహించిన పోషకుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులను వారి తల్లిదండ్రులు క్రమం తప్పకుండా కళాశాలకు పంపాలని సూచించారు. దీంతో పాటుగానే విద్యార్థులు ఇంటి వద్ద సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలని తెలిపారు. ఇక తమ కళాశాలలో సాయంత్రం సమయంలో ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నందున విద్యార్థులు ఈ తరగతులకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. అంతేగాక విద్యార్థులు కళాశాలలకు రెగ్యులర్‌గా వస్తున్నారా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు అప్పుడప్పుడు పరిశీలించాలని తెలిపారు. కళాశాల నిర్వహణలో ఏవైనా ఇబ్బం దులుంటే తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కళాశాల సిబ్బంది రమేష్, బాలాజీ, సంతోష్, నాయక్, సాయిలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట బంద్ సంపూర్ణం

లింగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలో హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ సంపూర్ణంగా జరిగింది. మండల కేంద్రంలోని విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, హోటళ్లు, కిరణ దుకాణాలు, వస్త్ర దుకాణాలు, ఇతర వ్యాపారులు బంద్‌కు పూర్తి మద్దత్తు తెలియజేశారు. బంద్ సంద్భంగా హిందూ సంఘాలు ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



లింగంపేటలో హిందు సంఘాల ర్యాలీ

● మేనూర్‌లో స్వచ్ఛందంగా బంద్

మద్నూర్: హిందూ దేవతల విగ్రహా లను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మద్నూర్ మండలం మేనూరులో హిందూ సంఘాల పిలుపు మేరకు స్వచ్ఛందంగా వ్యాపార సంస్థలను మూసివేసి వ్యాపారస్తులు, గ్రామస్తులు నిరసన వ్యక్తంచేశారు. అనం తరం బస్టాండ్ వద్ద రహదారి పై ధర్నా నిర్వహించారు. ఇటీవల సికిం ద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయంలో మరో వర్గానికి చెందిన వ్యక్తి విగ్రహాన్ని తన్నడం, ధ్వంసం చేయడం చాలా బాధాకరమైన విషయం. ఆ వ్యక్తిపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని అతడికి కఠిన శిక్ష పడేలా చూడాలని మేనూర్ హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.బంద్‌లో పాల్గొన్న వ్యాపారులకు సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్, నాయకులతో పాటు విశ్వహిందూ పరిషత్,హిందూవాహిని,భజరంగ్ దళ్ గోసేవా సమితి తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పనితీరుపై నాబార్డు ప్రతినిధుల విచారణ

● రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి : నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్



లింగంపేట రైతులతో మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం

లింగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పనితీరుపై నాబార్డు ప్రతినిధులు గురువారం లింగంపేట సహకార సంఘంలో రైతులతో సమావేశమై సంఘాల అభివృద్ధి, నష్టాలకు గల కారణాలను తెలుసుకున్నారు. లింగంపేట సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. సంఘానికి రావాలసిన ఎల్‌టీ రుణాలు రూ.12కోట్లు ఉన్నాయని వాటిని చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. సొసైటీకి ఆర్థికంగా ఎలాంటి లాభాలు ఉన్నాయని వారు ప్రశ్నించగా సొసైటీ కాంప్లెక్స్ ద్వారా అద్దెలతో పాటు ఎరువులు, విత్తనాలు విక్రయించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే కమిషన్‌లు సంవత్సరానికి రూ.50లక్షల వరకు ఉంటాయని చైర్మన్ దేవేందర్‌రెడ్డి తెలియజేశారు. సొసైటీ కాంప్లెక్ నిర్మాణానికి బ్యాంకు ద్వారా రూ. 3కోట్ల వరకు రుణాలు తీసుకున్నామని వాయిదాల ప్రకారం చెల్లిస్తున్నామని కేవలం రూ.18లక్షలు మాత్రమే అప్పు ఉందని ఆయన తెలియజేశారు. నాబార్డు ప్రతినిధులు ఆర్‌ఎస్ సక్సేనా, అభిషేక్, అక్బర్‌లు సొసైటీ పనితీరు బాగుందని తెలియజేశారు.రైతులకు రుణాలను ఏవిధంగా ఇస్తున్నారని వారు ప్రశ్నించగా పంట రుణాలను ఎకరాకు రూ.45వేల వరకు ఇస్తున్నామని తెలియజేశారు. దీర్ఘకాలిక రుణాలు గతంలో ఇచ్చిన రుణాలు వసూలు కాకపోవడంతో ఇవ్వలేకపోతున్నామని చైర్మన్ తెలియజేశారు. సొసైటీ కాంపెక్స్ పైన నిర్మాణం జరుపుతున్నా మని దానికిగాను మరో రూ.50లక్షల రుణం అవసరముందని చైర్మన్ అడుగగా దీర్ఘకాలిక రుణాల రికవరీ శాతం తక్కువగా ఉందని దానిని కనీసం 50 శాతం చెల్లించేలా చూడాలని వారు తెలియజేశారు. సొసైటీ ద్వారా రైతులకు మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని చైర్మన్ తెలియజేశారు. సొసైటీ అభివృద్ధిపై నాబార్డ్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. దీర్ఘవకాలిక రుణాల వసూలును పెంచాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో సుమన్ ఏజీఎమ్ఎన్‌డీ సీసీ బీ,కుమారస్వామి బీఎమ్‌లతో పాటు సొసైటీడైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

కుల, మత వర్గాలకు అతీతంగా షెట్టర్‌ల కూల్చివేత చేపట్టాలి

బీర్కూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను, గృహాలను కుల, మతవర్గాలకు అతీతంగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. గురువారం దుకాణదారులు, గృహ యజమానులు, యువకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దుకాణదారులు గృహ యజమానులు మాట్లాడుతూ బీర్కూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఒక వర్గం షట్టర్‌లను వదిలేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న అన్ని దుకాణాలను గృహాలను తొలగించి డ్రైనేజీలు నిర్మించారని అన్నారు. ఒక వర్గానికి చెందిన షెట్టర్‌లను మాత్రం ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. అందరికీ ఒకేలా న్యాయం ఉండాలన్నారు. ఒక వర్గం వారు షట్టర్‌లను తొలగించకపోవడం మూలంగా అక్కడ డ్రైనేజీ నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. సంబంధిత అధికారులు, సదరు కాంట్రాక్టర్ స్పందించి షట్టర్‌లను తొలగించి డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు.



బీర్కూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంలోని బాలికల బీసీ వసతి గృహంలో విద్యార్థినిలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా సిఈవో చందర్ నాయక్ సూచించారు. గురువారం బాలికల వసతి గృహంను సందర్శించిన సిఈవో వంటశాల ఆవరణ చూడటంతో పాటు, వంట సావగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఈవో చందర్‌నాయక్ మాట్లాడుతు విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు డోర్ టూ డోర్ ఇంటి సర్వే ఎలా చేయాలో వివరించారు. దీంతో పాటుగానే ఐకెపీ సిబ్బందికి చార్ట్ రిజిష్టర్ ఎలా వ్రాయాలో అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీనివాస్, ఎంపీవో రాము, ఐకేపీ,ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ

తాడ్వాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకుకు మండలంలోని చిట్యాల గ్రామంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం నాలుగు రోజుల పాటు జరిగిందని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో కేంద్ర ప్రభుత్వం జల్‌దన్‌లో భాగంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం ముగిసిన తరువాత గ్రామ సహాయకులకు శిక్షణ ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమలో ఏఈ శ్రీకాంత్, మిషన్ భగీరథ శిరీషా, గ్రామ నీటి సహాయకులు గాండ్ల రాజు, రమేష్, వివిధ గ్రామాల నీటి సహాయకులు తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి భిక్కనూరు మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయల కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా, రైతాంగ విధాలను వ్యతిరేకంగా ఆదిలాబాద్‌లో నిర్వహించిన పోరుబాటకు భిక్కనూరు మండలం నుండి పెద్దఎత్తున తరలివెళ్లడం జరుగుతుందన్నారు. మోసపూరిత హమీలతో గద్దెనెక్కి అధికారంలోకి రాగానే ఇచ్చిన హమీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అందకుముందుగా పొందుర్తి చౌరస్తా వద్ద మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సారెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి నడివడికను నేర్చుకోవాలి

కామారెడ్డిటౌన్,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ కళాశాల నుంచే విద్యార్థులు మంచి నడివడికను నేర్చుకోవాలని కామారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయకుమారి అన్నారు. గురువారం విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో బోధన అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని తల్లిదండ్రులను తమ పిల్లలను ఇతర పనులకు పంపడంలాంటివి చేయవద్దని, ప్రస్తుతం అన్ని వసతులు కళాశాలలో ఉన్నాయని తెలిపారు. కళాశాల నిర్వహణ, స్టడిఅవర్స్‌చదువు యొక్క ప్రాముఖ్యత, ఉచిత విద్య తదితర అంశాలపై వివరించారు.విద్యార్థులను రెగ్యులర్‌గా కళాశాలకు పంపాలని తెలిపారు.ఈ సమావేశంలో అధ్యాపకులు ఫణికుమార్, విజయ,ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు సన్మానం

రామారెడ్డి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో రామారెడ్డి పీహెచ్‌సీ ఏఎన్ఎం విధులు నిర్వహించి రెడ్డిపేట్ బదిలీపై వెళ్లిన భువనేశ్వరికి గురువారం ప్రజాప్రతినిధులు సన్మానం చేశారు. బదిలీపై పోసానిపేట్ గ్రామానికి వచ్చిన ఏఎన్ఎం పద్మకు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో పోసానిపేట్ గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పోతుల బాపురెడ్డి, రైతు నాయకుడు నారెడ్డి రాజిరెడ్డి, బెస్త ఆనందం, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాల కేంద్రాలకు సబ్సిడీపై దాణాను సరఫరా చేయాలి



సాయిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామాల అధ్యక్షుడు, సిబ్బంది

తాడ్వాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి బీఎంసీ పరిధిలోని పాల కేంద్రాలకు సబ్సిడీపై దానాలు సరఫరా చేయాలని బీఎంసీ అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. ఈయన గురువారం మండల కేంద్రంలోని బీఎంసీ సెంటర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లా డారు. పాల బిల్లులు సకాలంలో చెల్లించాలని తీర్మానించారు. బీఎంసీ పరిధిలోని ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన బీఎంసీ అధ్యక్షుడు సాయిరెడ్డిని ఆయా గ్రామాల అధ్యక్షులు సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఇందులో పాల కేంద్రం అధ్యక్షులు కృష్ణమూర్తి, రాజేశ్వర్, సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి, మేనేజర్ నిరంజన్‌రెడ్డి, సూపర్ వైజర్ రమేష్, ఆయా గ్రామాల పాల కేంద్రం అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో సమస్యలు..

(5వ పేజీ తరువాయి)

ఈ బిల్డింగ్‌లో 250 నుంచి 300 మంది విద్యార్థులు ఉండే విధంగా సామర్థ్యం మాత్రమే ఉందని పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం బిల్డింగ్‌లో 430 మంది విద్యార్థులు ఉండి చదువుతున్నారని పిల్లలకు సరిపడా బాత్రూంలు లేవని, స్నానాల గదులు లేవని, డార్మెంటరి లేదని, చదువుకునే క్లాసులోనే పడుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మా పిల్లల లగేజ్ కూడా క్లాస్‌రూమ్‌లోనే పెట్టుకోవాల్సి వస్తుందని, వర్షం పడితే కిటికీలు మూస్తే తలుపులు లేవు కింద అయినా పడుకుందామంటే మా పిల్లలు చదువుకునే రూముల్లో ఫ్లోరింగ్ లేక గుంతలలో పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవుల సమయంలో పిల్లలను చూసేందుకు వెళితే ఏడుస్తు వారి బాధలను చెప్పుకుంటున్నారని పిండుకున్న బట్టలు ఆరేయడానికి కూడా స్థలం లేని పరిస్థితి ఉందని, పచ్చి బట్టలు వేసుకుంటే దురద, తామర, గజ్జి లాంటి అంటువ్యాధులు సోకి అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొంటున్నారు. అవస్థలు పడుతూ సరిగ్గా నిద్రలేక పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదగలేకపోతున్నారని డ్రిల్ పీరియడ్‌లో ఆటలు ఆడుకుందామంటే ఆట స్థలం లేని పరిస్థితి, మా పిల్లలకు ప్రతీ రెండో ఆదివారం ఇంటి నుంచే భోజనం తీసుకెళ్లి తినిపించి కాసేపు మాట్లాడుకుందామనుకుంటే సరైన గ్రౌండ్ లేకపోవడంతో బొందల గడ్డల పక్కన కూర్చుని చెట్లకింద భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరుతున్నామన్నారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికిన బీఆర్ఎస్‌నాయకులు



ఎమ్మెల్యే కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్‌లో జరిగే రైతు ధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్‌తో పాటు నాయకులు నర్సన్నపల్లి జాతీయరహదారిపై స్వాగతం పలికారు. ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో రైతు ధర్నాలో పాల్గొనేందుకు ఆయనతో పాటు కలిసి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ రవియాదవ్, నాయకులు లక్ష్మీనారాయణగైని శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్‌లు హాఫీజ్,నజీరొద్దిన్ పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగిఉండాలి



భిక్కనూరు సమాఖ్యలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాణి

భిక్కనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి జిల్లా న్యాయాధికారినాగరాణి అన్నారు. గురువారం భిక్కనూరు సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశానికి హాజరై న్యాయాధికారి మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, సమాఖ్య సభ్యులు వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని,మహిళా సంఘాల సభ్యులందరూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సమాజంలో నేరాలు జరిగిన తర్వాత ఇబ్బందులు పడేకంటే ముందుగానే నేరాలకు అవకాశం ఇవ్వకపోతే చాలా ప్రమాదం తప్పుతుందన్నారు.అంతకుముందుగా జిల్లా న్యాయాధికారికి సమాఖ్య ప్రతినిదులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో డీపీ ఎం సురేష్‌కుమార్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎస్సై, సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి, ఏపీఎం, సీసీలు, సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బావిలో దూకి ఒకరి మృతి

తాడ్వాయి,అక్టోబరు 24 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని నంది వాడ గ్రామంలో కుటుంబ కల హాలతో బావిలో దూకి ఒకరు చనిపోయినట్లు తాడ్వాయి ఏ ఎస్ఐ సంజీవ్ తెలిపారు. వివ రాలు ఇలా ఉన్నాయి. మండ లంలోని నందివాడ గ్రామానికి చెందిన సాయికుమార్ (25) కుటుంబ కలహాలతో బుధవారం సాయంత్రం గ్రామంలోని సాదా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఇతనికి శ్రీహన్(2) బాబు ఉన్నాడు. తల్లి బుదవ్వ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

దోమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయం శిఖరానికి మరమ్మతులు



శిఖరానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

దోమకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివరాం మందిర్ ఆలయంలోని శివుడి గోపురం శిధిలావస్థకు చేరడంతో దోమకొండకు చెందిన పబ్బ విజయ్ కుమార్ ముందుకు వచ్చి శిఖరం మరమ్మతు పనులు చేయిస్తున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. మరమ్మతు పనులు చేయించడానికి ముందుకు వచ్చిన విజయ్ కుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్జీవోస్ మద్నూర్ తాలూకా కార్యవర్గ సభ్యుల ఎంపిక

మద్నూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ తాలూక టీఎన్జీవో నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీ నరాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మద్నూర్ తాలూక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే మద్నూర్ తాలూక యూనిట్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడిం చారు. అధ్యక్షులుగా పవన్‌కుమార్, కార్యదర్శిగా రంజిత్‌కుమార్, కోశాధికారిగా యు.విశాల్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, దయానంద్, మహిళా ఉపాధ్యక్షుడిగా కళావతి, సంయుక్త కార్యదర్శిగా దత్తు, పండరి, సౌమ్య శ్రీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శంకర్, పబ్లిసిటీ సెక్రటరీగా శ్రీహర్ష, ఈసీ మెంబర్‌గా కుషాల్, వెంకటాంరెడ్డి, అబ్దుల్ నయీమ్, అనిల్ ఎన్నికైనట్లు టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నికల అధికారి యు.సాయిలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐకమత్యంతో ఉండి ఉద్యోగ సమస్యల కొరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయుటకు టీఎన్జీవోస్ సంఘం ఎల్లప్పుడు ముందుంటుందని, ఉద్యోగుల సమస్యల సాకారానికి మద్నూర్ యూనిట్ జిల్లా కార్యవర్గానికి ఎల్లప్పుడు చేదోడు వాదోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులను శాలువాతో పుష్ప గుచ్చంతో ఘనంగా సన్మానించారు.



నూతనంగా ఎంపికైన టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	దేవర
దర్శన్	సలార్
ప్రియా 35	విశ్వం
ప్రియా 70	విరయన్

బాన్సువాడ	
మహేశ్వరి	సలార్
వెంకటేశ్వర	విశ్వం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	130	160	190

